## క్లుప్తంగా

### మరమ్మతులు నాణ్యతగా చేపట్టండి

బాలానగర్: పెద్దరేవల్లి గ్రామ బీటీరోడ్డుకు చేపట్టిన బీటీ రోడ్డు మరమ్మతు పనులు నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బాలానగర్ నుంచి పెద్దరేవల్లి బీటీ రోడ్డుకు మరమ్మతు పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ వెంకటాచారి తదితరులు ఉన్నారు.

### ధ్యానం దినచర్యగా మార్చుకోవాలి



మిడ్జిల్: ప్రతి మనిషి నిత్య జీవితంలో ధ్యానాన్ని దినచర్యగా మార్చుకుని, ప్రశాంతను పొందవచ్చని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కొత్తూర్, మల్లాపూర్‌లో ప్రజలకు ధ్యానంపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు ధ్యానం చేయడం వలన ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయని, మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పద్మ, జంగయ్య, కృష్ణ, మణికంఠ పాల్గొన్నారు.

### కరెంట్ సమస్య తీర్చాలని రాస్తారోకో



మిడ్జిల్: మండలంలోని పెద్దగుంటతండా, మర్లబావి తండాలో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని తండా వాసులు వాపోయారు. గురువారం మండల కేంద్రంలోని జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. రెండు రోజుల నుంచి పశువులకు, ప్రజలకు తాగునీరు లేక ఎంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు వచ్చి సమస్యను తీర్చుతామని తెలపడంతో రాస్తారోకోను విరమించారు.

### భట్టి విక్రమార్కకు సన్మానం

దేవరకద్ర: కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా పాదయాత్రలో ఉన్న ఆయనను గురువారం సాయంత్రం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్ కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌ను కట్ చేయించి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

### మార్కెట్‌లో లావాదేవీలు నిల్

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం ఎలాంటి లావాదేవీలు కాలేదు. ధాన్యం సీజన్ ముగియడంతో రైతులు మార్కెట్‌కు అమ్మకానికి తేవడం లేదు. దీంతో ఈ–నామ్ టెండర్లను నిలిపి వేశారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. కేవలం ఉల్లి పాయల విక్రయాలు మాత్రమే కొనసాగాయి.

### కల్యాణలక్ష్మి చెక్కు అందజేత



అడ్డాకుల: మండలంలోని చిన్నమునుగల్‌ఛేడ్ చెందిన మనెమ్మ కుమార్తె జ్యోతికి వివాహం కావడంతో కల్యాణలక్ష్మి ద్వారా మంజూరైన చెక్కును గురువారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. కల్యాణలక్ష్మి ద్వారా నిరుపేద యువతుల వివాహాలకు సీఎం కేసీఆర్ సాయం అందించి ఆదుకుంటున్నారని ఆయన తెలిపారు. అంతకు ముందు మండల కేంద్రానికి చెందిన ఇమ్మానుయేల్ చనిపోవడంతో మృతుని కుటుంబానికి రూ.5వేలను పంపించారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, జయన్నగౌడ్, ఖాజాఘోరీ, అనురాధ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### 'విద్యార్థిపై దాడి చేయడం తగదు'

జడ్చర్ల: పరీక్షకు సమయం లేకపోవడంతో బాలికను, ఓ బాలుడు తన బైక్‌పై లిఫ్ట్ ఇవ్వడంతో బాలిక వర్గానికి చెందిన కొందరు విద్యార్థిపై దాడి చేయడం తగదని స్థానిక బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. కేవలం మానవతా దృక్పతంతో సాయం చేస్తే సదరు విద్యార్థిపై దాడి చేశారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో సతీష్ తదితరులు పాల్గొన్నారు. సంఘటనకు సంబంధించి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అభివృద్ధి బాటలో పల్లెలు



రాజాపూర్‌లో ఎంపీడీఓకు సన్మానం..



నవాబుపేటలో పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మిడ్జిల్‌లో..

జడ్చర్ల: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం పల్లెలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని ఆలూరు, చర్లపల్లి, పెద్ద ఆదిరాల గ్రామాలలో పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీల వద్ద జెండావిష్కరణ చేశారు.

**పల్లెల్లో ప్రగతి పండుగ**

నవాబుపేట: పల్లెప్రగతి కార్యక్రమం నిర్వహించి పంచాయతీల వద్ద జాతీయ జెండాలు ఆవిష్కరించారు. సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీడీఓ శ్రీలత, సర్పంచ్ గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

**సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి**

రాజాపూర్: సమష్టి కృషితోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమైందని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని పంచాయతీలపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎంపీఓ వెంకట్‌రాములు, వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించారు.

**తెలంగాణ దేశానికే ఆదర్శం**

మిడ్జిల్: తెలంగాణ నేడు దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన పల్లెప్రగతిపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

**పల్లెల్లో పరిశుభ్రతకు కార్మికులే కీలకం**

భూత్పూర్: పల్లెల్లో పరిశుభ్రతకు పంచాయతీ కార్మికులే కీలకమని సర్పంచ్‌లు కొనియాడారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ ఎదుట ముగ్గులు వేశారు.

**పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం**

దేవరకద్ర: మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం పంచాయతీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను, సిబ్బందిని అధికారులు సన్మానం చేశారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, కార్మికులు, పంచాయతీ సిబ్బందితో పాటు మండల అధికారుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. సర్పంచ్ విజయలక్ష్మిని మండల అధికారులు సన్మానించారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లో పల్లె ప్రగతి దినోత్సవాలను నిర్వహించారు. పంచాయతీల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ టీచర్లను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, ఎంపీపీలు నాగార్జున్‌రెడ్డి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. పంచాయతీ ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కొంరెడ్డిపల్లిలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం పల్లె ప్రగతి సందర్భంగా ఊరూరా జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామసభ నిర్వహించి పంచాయతీ కార్యదర్శులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. గ్రామపంచాయతీ కార్మికులను సన్మానం చేసి కొత్త దుస్తులు పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రశంసాపత్రాలు ఇచ్చారు. కార్యక్రమాలలో సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్, మల్లు దేవేందర్‌రెడ్డి, మల్లు రమ్య, చంద్రకళ, జరీనాబేగం, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: కంచన్‌పల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఏఈ ముతీం పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండలంలో పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగరవేశారు. అనంతరం బతకమ్మలు, బోనాలతో ర్యాలీలు నిర్వహించారు. పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సత్కరించారు.

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలంలోని పంచాయతీ సిబ్బందిని సర్పంచ్ స్వప్న శాలువలతో సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు.



భూత్పూర్ మండలం చౌళ్లతండాలో..



దేవరకద్రలో..



అడ్డాకులలో..



గండేడ్ మండలం కొంరెడ్డిపల్లిలో..



కోటకదిరలో..



కంచన్‌పల్లిలో..

# పల్లెప్రగతితో సర్వతోముఖాభివృద్ధి



గౌతాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: ప్రభుత్వం చేపట్టిన పల్లెప్రగతితో గ్రామాలు, పల్లెలు సర్వతోముఖాభివృద్ధి సాధించాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గౌతాపూర్, బోడజానంపేట్‌లో చేపట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయన పాల్గొని గ్రామవీధుల్లో గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించి, నర్సరీలను పరిశీలించిన ఆయన పంచాయతీ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేశారు. కార్మికులను శాలువాలు, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతం, వర్తమానం ఏ విధంగా ఉందో పోల్చుకోవాలని, మరింత మంచి భవిష్యత్ కావాలంటే ఏ పార్టీ అధికారంలో ఉండాలో ప్రజలు ఆలోచించాలని చెప్పారు. 24 గంటల కరెంట్, తాగునీరు, చెరువులు, బీటీ రోడ్లు, సబ్‌స్టేషన్లు ఇలా చెప్పుకుంటూపోతే రోజులు సరిపోవని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటాచారి, సర్పంచ్‌లు రమేష్, చంద్రకళ, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ప్రకాష్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే తెలంగాణ అభివృద్ధి ఆదర్శం



గోపన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

దేవరకద్ర రూరల్: పదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం బస్వాయపల్లి, గోపన్‌పల్లిలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. అన్ని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించబడిన రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ప్రతి పంచాయతీలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం, క్రీడా మైదానాలు, ప్లాంటేషన్, డంపింగ్‌యార్డు, వైకుంఠ ధామాలతో పాటు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తూ, వార్షిక ఆడిట్లను కూడా ఆన్‌లైన్‌లో చేస్తున్నట్లు తెలిపారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

బస్వాయపల్లిలో ముదిరాజ్, వాల్మీకి కమిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ, ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్వాయపల్లి నుంచి వేముల వరకు మట్టి రోడ్డు వేసేందుకు భూమి పూజ చేశారు. గోపన్‌పల్లిలో వాల్మీకి కమిటీ హాల్‌ను ప్రారంభించడంతో పాటు యాదవ కమిటీ హాల్, ఆరోగ్య ఉప కేంద్రం, ఎస్సీ కమిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో పంచాయతీ సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నపూర్ణ, ఎంపీపీ రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, జెట్టి నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు రజిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

**పల్లెల అభివృద్ధికి సీఎం కృషి**

భూత్పూర్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి తెలంగాణలో సీఎం కేసీఆర్ చేశారని, పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందడానికి సీఎం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని శేరిపల్లి (హెచ్)లో పంచాయతీ భవన నిర్మాణానికి కలెక్టర్ రవినాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం, సాగు, తాగునీరు అందించామన్నారు. మండలంలో ఆరుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, అన్నాసాగర్, శేరిపల్లి (హెచ్), హస్నాపూర్ మీదుగా మహబూబ్‌నగర్ వరకు బీటీ రోడ్డు ప్రతిపాదనలు పంపించామన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిక**

మండలంలోని పోతులమడుగులో వివిధ పార్టీలకు చెందిన పది మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సర్పంచ్ బోల శేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లాభాల బాటలో మిడ్జిల్ పీఏసీఎస్

- ఐదేళ్ల క్రితం సిబ్బంది జీతాలకు కష్టం
- ఇప్పుడు ఏటా రూ.లక్షల్లో ఆదాయం



మిడ్జిల్ సింగిల్ విండో కార్యాలయం

మిడ్జిల్: మండల సహకార సంఘం 2018 ముందు కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం కష్టంగా ఉండేది. నెలనెల దాదాపు రూ.75వేల జీతాలు చెల్లింపులకు ఆరు నెలల సమయం పట్టేది. ప్రస్తుతం ధాన్యం కొనుగోలుతో ఏటా రూ.లక్షల ఆదాయం సమకూరుతుంది. దీంతో రైతులకు మంచి మద్దతు ధర లభించడంతో ఎంతో మేలు కలుగుతుంది. ఐదేళ్ల క్రితం ఉమ్మడి మిడ్జిల్ మండల రైతులు తాము పండించిన ధాన్యాన్ని జడ్చర్ల, కల్వకుర్తి మార్కెట్ యార్డులలో, గ్రామాలలో దళారులకు విక్రయించి నష్టపోయేవారు. 2018 నుంచి సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో రూ.11.49లక్షల ఆదాయం వచ్చింది. 2019లో రూ.25 లక్షలు, 2020లో రూ.17.50లక్షలు, 2021లో రూ.11 లక్షల ఆదాయం సమకూరింది. 2021–22లో ఎరువులు, వడ్ల కొనుగోలు, ఫెస్టిసైడ్స్ ద్వారా రూ.39,09,675 ఆదాయం వచ్చింది. అలాగే ఎరువుల విక్రయం వలన 2019లో రూ.2.17లక్షలు, 2020లో రూ.లక్షా5వేలు, 2021లో రూ.3.36లక్షల ఆదాయం వచ్చింది. 2019లో మొక్కజొన్న కొనుగోలు వలన రూ.2.80లక్షల ఆదాయం వచ్చింది. విత్తనాలు విక్రయించడం వలన 2019లో రూ.65వేలు, 2020లో రూ.84వేలు, 2021లో రూ.32వేల ఆదాయం వచ్చింది. 2021 రబీ సీజన్‌లో 2,07,066 సంచుల వడ్లను కొనుగోలు చేశారు. వాటి కమీషన్ కింద దాదాపు రూ.26 లక్షలు వచ్చాయి. రెండేళ్ల క్రితం, సింగిల్‌విండో కార్యాలయం చుట్టూ ఏడు షెటర్లను నిర్మించడం వలన నెలనెల వాటి అద్దె సంవత్సరానికి రూ.1.50లక్షలు వస్తుంది. దీంతో రైతులకు కూడా రుణాలను అదేస్థాయిలో ఇస్తున్నారు. సకాలంలో ఎరువులను నిల్వచేసి రైతులకు ఇబ్బంది లేకుండా సరసమైన ధరలకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు నాణ్యమైన కంపెనీవి సరఫరా చేస్తున్నారు.

**మెరుగైన సేవలు..**



మిడ్జిల్ సింగిల్‌విండో కార్యాలయం ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందిస్తున్నాం. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేస్తాం. అలాగే నాణ్యమైన విత్తనాలను క్రిమిసంహారక మందులను రైతులకు తక్కువ ధరలకు అందిస్తున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్, మిడ్జిల్

**రైతులకు ఇబ్బంది లేకుండా..**



సింగిల్ విండో కార్యాలయం ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు, విత్తనాలను సకాలంలో అందుబాటులో ఉంచుతున్నాం. రైతు పండించిన ధాన్యం తేమశాతం మంచిగా ఉంటే ఏ గ్రేడ్ ధర లభిస్తుంది.

–బాల్‌రెడ్డి, సింగిల్‌విండో కార్యదర్శి

### మత్తుకు దూరంగా ఉండాలి

చిన్నచింతకుంట: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని ఎస్ఐ మోహన్ బాబు సూచించారు. గురువారం మండలంలో మత్తు పదార్థాల నిర్మూలనపై యువకులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు.

### ఎస్ఐగా శ్రీనివాస్ బాధ్యతలు

బాలానగర్: మండల ఎస్ఐగా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్ఐగా పనిచేసిన జయప్రసాద్ మహబూబ్‌నగర్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లగా, సీసీఎస్ నుంచి శ్రీనివాస్ మండల ఎస్ఐగా వచ్చారు.

### మాజీ ఎంపీ పరామర్శ



చిన్నచింతకుంట: మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా, మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ గురువారం సాయంత్రం మండలంలోని పర్కాపురంలో నివాసానికి చేరుకున్నారు. దయాకర్‌రెడ్డి భార్య సీతమ్మను వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

**నేడు రేవంత్‌రెడ్డి రాక**

మాజీ ఎమ్మెల్యే దివంగత కొత్తకోట దయాకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం మండలానికి రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్: మండలంలోని బైరంపల్లి శివారులో దుందుభీనది నుంచి గురువారం సాయంత్రం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాంలాల్‌నాయక్ గురువారం తెలిపారు. జడ్చర్ల మండలంలోని కోడుపర్తి చెందిన బోయపాపయ్య, బోయ రమేష్ నిత్యం ఇసుకను తరలిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

### కొత్తపల్లిలో విద్యుత్ వైర్లు చోరీ

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారులో రైతు మల్లెపోగు శ్రీశైలం వ్యవసాయ భూమిలో ఆదివారం రాత్రి 7 స్తంభాల విద్యుత్ వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సంఘటనపై రైతు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రాంలాల్ నాయక్ గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. చోరీకి గురైన వైర్ల విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లూరుకు చెందిన బాలరాజు బుధవారం రాత్రి తన స్కూటీపై మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్లకు వస్తుండగా నక్కలబండతండా వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి, తదుపరి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. గురువారం బాధితుడి సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### లీకేజీని సరిచేసిన అధికారులు



రాంనగర్‌లో పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వార్డు నంబర్ 43 పరిధిలోని రాంనగర్‌లో పలు గల్లీలకు మిషన్ భగీరథ పథకం నుంచి కొన్ని నెలలుగా తాగునీరు పూర్తిస్థాయిలో రాకపోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అసలే వేసవికాలంలో ఇంటింటికీ తక్కువగా కొద్దిసేపు మాత్రమే వచ్చి ఆగిపోవడంతో ఇటీవల వారు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. చివరకు ఆయన ఆదేశాల మేరకు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో లీకేజీ అవుతున్న పైపులైన్‌ను మున్సిపల్ అధికారులు సరిచేశారు. మరమ్మతు చేసిన ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఇక నుంచి ఈ వార్డులోని అన్ని గల్లీలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందుతుందని డీఈఈ బెంజిమన్ తెలిపారు.

**తెలంగాణచౌరస్తాలో లీకేజీలు**

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో రెడ్‌క్రాస్ భవనం ఎదుట పైపులైన్ లీకవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ లీక్ అవుతున్న నీళ్లు దాదాపు ఒక కాలనీ సరిపడ వృథాగా పోతున్నాయి. ఎక్స్‌పో ఎదుట లీకయ్యే నీళ్లతో ఓ పెద్ద సైజ్ కుంటగా మారుతుంది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### నిధులున్నా మరమ్మతులపై నిర్లక్ష్యం



రాయపల్లి వరకు దెబ్బతిన్న బీటీ రోడ్డు

రాజాపూర్: గ్రామీణ ప్రాంతాలకు ఉన్న బీటీ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.లక్షల నిధులు మంజూరు చేస్తున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలోని ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి నుంచి రాయపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతు చేసేందుకు రూ.60 లక్షలు, మండల కేంద్రం జాతీయ రహదారి నుంచి మల్లేపల్లి మీదుగా ఈద్గాన్‌పల్లి వరకు దెబ్బతిన్న బీటీరోడ్డుకు మరమ్మతు చేసేందుకు రూ.75 లక్షల నిధులు గతేడాది మంజూరయ్యాయి. ఇప్పటి వరకు దీనిపై ఉలుకు పలుకు లేదు. దీంతో ఇంకా ఎన్ని నెలలు ఈ దెబ్బతిన్న రోడ్లపై ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేయాలో అంటూ ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా గ్రామాలకు నిధులు మంజూరైన వెంటనే అధికారులు టెండర్లు పూర్తి చేశారు. ఈ రెండు గ్రామాలకు మంజూరైన పనులకు టెండర్లు కూడా పూర్తికాలేదు.

**అధికారులు స్పందించాలి**



గుంతల రోడ్లపై ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నాం. నైట్ డ్యూటీలకు వెళ్లి వస్తూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు చాలామంది గుంతలు ఉండటంతో వాహనాలపై నుంచి పడి కాళ్లు, చేతులు విరిగిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయించాలి.

– మణిశంకర్‌గౌడ్, రాయపల్లి

**సమస్యను వివరిస్తాం..**

నిధులు మంజూరైంది వాస్తవమే. తొందరలో ఈ రెండు గ్రామాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేసేందుకు టెండర్లు పిలుస్తాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– హలీమ్, ఏఈ పంచాయతీ రాజ్